నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి 1
శనివారం 29 జులై 2023

గురుకులంలో ఉండలేం.. ఇండ్లకు వెళ్లిన 29 మంది

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బి) లోని మహాత్మా జ్యోతిబాపులే బాలుర గురుకుల కళాశాలలో చదువుకుంటున్న 29 మంది విద్యార్థులు శుక్రవారం ఉదయం మూకుమ్మడిగా ఇంటికి వెళ్తున్నామని చెప్పి వెళ్లిపోయారు. వీరంతా ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నారు. వీరంతా ఇంటికి చేరుకున్నట్లు మహాత్మా జ్యోతిబాపూలే ప్రిన్సిపాల్ రవికుమార్ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఇదిలా ఉండగా విద్యార్థులపై చర్యలు తీసుకొనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. కాగా వసతి గృహంలో తమకు సరిగా భోజనం పెట్టడం లేదని, నీటి సమస్య ఉందని విద్యార్థులు గత కొన్ని రోజులుగా ఆరోపిస్తున్నారు. వీరంత గతంలో కంజర్ కాలేజీలో చదువుకునే వారని, ఈ ఏడాది నుంచి ధర్మారం బిలో కొత్తగా కళాశాల ఏర్పాటు చేయడంతో కొందరు విద్యార్థులను ఆ కళాశాల నుంచి ధర్మారం బి కాలేజీకి మార్చారు. ఈ విషయంపై ప్రిన్సిపల్ రవికుమార్ ను పలుమార్లు ఫోన్ చేయగా.. స్పందించలేదు.

గల్లంతయిన వ్యక్తి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-పిట్లం

చేపల వేటకు వెళ్లి గల్లంతయిన వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు నిజాంసాగర్ ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై కథనం మేరకు నిజాంసాగర్ మండలం నర్సింగ్ రావు పల్లి నల్ల వాగు మత్తడి లో పిట్లం మండల కేంద్రానికి చెందిన జంగం కృష్ణ (48) గురువారం నల్లవాగు మత్తడిలో చేపలు పట్టడానికి వెళ్లాడు. చేపలు పడుతున్న క్రమంలో వరద ఉధృతి పెరగడంతో అదుపుతప్పి నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. సమాచారం అందుకుని ఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టగా వరద ఉధృతి పెరగడంతో సహాయ చర్యలకు అంతరాయం ఏర్పడింది. అయినా గాలింపు చర్యలు ముమ్మరం చేయడంతో శుక్రవారం మధ్యాహ్నం నర్సింగ్ రావు పల్లి శివారులోనే ఆయన మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పొలాల్లో ఇసుక మేటలు

- పంటలను కప్పేసిన మట్టి
- ఇసుకను తొలగించేందుకు ఇబ్బందులు
- ఆర్థికంగా చితికిపోతున్న రైతులు


వరి మడుల్లో ఇసుక మేటలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

భారీ వర్షాలు కురిసి వరద వచ్చిందంటే చాలు.. ఆ ప్రాంత రైతులు సాగుపై ఆశలు వదుకోవాల్సిన పరిస్థితి. ఇసుక వచ్చి పొలాల్లో మేటలు వేస్తుండటంతో ఇటు పంటకు నష్టం వాటిల్లడంతో పాటు ఇసుక మేటను తొలగించేందుకు రైతులకు ఆర్థికంగా ఇక్కట్లు తప్పడం లేదు. తాజాగా కురిసిన భారీ వర్షాలతో పొలాలను ఇసుక మేటలు కమ్మేశాయి. కొందరు రైతులు ఇప్పటికే వేసిన వరి నాట్లు, సోయాబిన్, పసుపు పంటలు పూర్తిగా ఇసుక కప్పేసింది. మరికొందరు రైతులు వరి నాట్ల కోసం సిద్ధం చేసుకున్న వరి నారు మడులు వరద ఉధృతికి పూర్తిగా కొట్టుకుపోయాయి.

భారీ వర్షాలకు కమ్మర్‌పల్లి మండలంలోని అన్ని ప్రాజెక్టులు, గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండి అలుగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. భారీగా కురిసిన వర్షంతో చెరువు అలుగులు, కాలువ నుండి వరద ప్రవహానికి కొట్టుకు వచ్చిన ఇసుక, మట్టి పంట పొలాల్లో మేటలు వేసింది. సోయాబిన్, పసుపు, మొక్కజొన్న, వరి పంట పొలాల్లో ఇసుక, మట్టి కమ్మేసిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల అడుగు ఎత్తు మేర ఇసుక మేటలు పంటలను కప్పేశాయి. ఇసుక మేటలతో తమ పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల పంట పొలాల్లో మట్టి పెరుకుపోయింది. పంటలను కప్పేసిన మట్టిని బ్లేడ్ ట్రాక్టర్‌తో తొలగించుకునేందుకు అవకాశం ఉంది. వెంటనే మళ్ళీ పంటలు వేసుకొవచ్చు. కానీ పంట పొలాల నుండి ఇసుక మేటలను తొలగించేందుకు రైతులు ప్రయత్నాలు చేస్తున్నారు.

పంటనష్టం.. ఆర్థిక కష్టాలు

పంట పొలాలను కమ్మేసిన ఇసుక మేటలను తొగించేందుకు రైతులకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికే వేసిన పంటలు చేతికి రాకుండా పోగా, పంట పొలాల్లో వేసిన ఇసుక మేటలను తీసేందుకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి రైతులకు ఏర్పడింది. పంట పొలాలను మళ్లీ సాగు సిద్ధం చేయాలంటే ఇసుక మేటలు తొలగించాలి. ఒక్కో ట్రాక్టర్ ఇసుక తీసేందుకు రూ.వెయ్యి వరకు ఖర్చవుతుందని, అయితే ఎకరా పొలంలో ఇసుకు మేటలు తీసేందుకు రూ.20వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు అంటున్నారు. మళ్లీ విత్తేందుకు విత్తనాలు కొనుగొలు చేయాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట చేతికి వచ్చే సమయం ముందుకు వెళ్లడంతో తరువాత వేసే పంటపై ప్రభావం పడుతుందని రైతులు అంటున్నారు. కొన్ని చోట్ల 15 నుండి 20 ట్రాక్టర్ల వరకు ఇసుకు మేటలు వేసినట్లు రైతులు వాపోతున్నారు. ఉప్లూర్‌కు చెందిన ఇద్దరు అన్నదమ్ములకు సంబంధిచిన సుమారు 6 ఎకరాల్లో ఉన్న పంటను ఇసుక మేటలు కమ్మేశాయి. అయితే వరి నాట్లు కొనసాగుతున్నందున ఇబ్బందైనా మళ్ళీ వేసుకొవచ్చని, కాని సోయాబిన్, పసుపు పంటలు వేసి నెల రోజులకు పైగా అవుతుందని ఈ పరిస్థితిలో మళ్ళీ వాటిని సాగు చేయడం కష్టమేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక మేటలు, మట్టి మూలంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం అదుకోవాలని రైతుటు కొరుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది.



ఇసుక మేటలను చూపుతున్న రైతులు.. పొలాల్లో వేసిన ఇసుక, మట్టి మేటలు



బోధన్ మండలం ఖాజాపూర్ శివారులో కొట్టుకుపోయిన సోయా పంట.. రెంజల్ మండలం బోర్గాం శివారులో వరి నీటమునక

33 వేల ఎకరాల్లో పంటనష్టం

- 24,025 మంది రైతులకు నష్టం.. నివేదిక రూపొందించిన అధికారులు
- అనధికారికంగా మరింత ఉండొచ్చని రైతుల ఆవేదన

నవతెలంగాణ-నిజామాబాద్

వారం వ్యవధిలో కురిసిన వర్షాలు.. రైతులకు తీవ్ర నష్టం కలిగించాయి. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 24035 మంది రైతులకు చెందిన 33429 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారులు అధికారికంగా లెక్క తేల్చారు. అయితే అనధికారికంగా మరింత నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు.

జులై నెలలో ఈ నెల 20వ తేదీతో పాటు 24-27వ తేదీ వరకు భారీ వర్షాలు కురిశాయి. వరి పంటతో పాటు సోయాబీన్, మొక్కజొన్న, పసుపు పంటలకు ప్రధానంగా నష్టం వాటిల్లింది. 26వ, 27వ తేదీల్లో కురిసిన భారీ వర్షంతో నష్టం అధికంగా వాటిల్లింది. కేవలం ఈ రెండు రోజుల్లో 20 మండలాల్లో 234 గ్రామాల్లో 18341 మంది రైతులకు చెందిన 26,866 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. అంతకుముందు 24వ తేదీన కురిసిన వర్షంతో సైతం మూడు మండలాల్లోని 37 గ్రామాల్లో 6138 ఎకరాలకు నష్టం వాటిల్లింది. నష్టపోయిన తమకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వరదలతో నష్టపోయిన పంటలు, రైతుల వివరాలు

తేదీ	వరి		సోయాబీన్		మొక్కజొన్న		పసుపు		మొత్తం	
	రైతులు	ఎకరాలు	రైతులు	ఎకరాలు	రైతులు	ఎకరాలు	రైతులు	ఎకరాలు	రైతులు	ఎకరాలు
20వ	20	25	-	-	-		-	-	20	25
24వ	2263	2741	1075	1407	1550	1350	480	640	5368	6138
25వ	218	290	35	40	53	70	-	-	306	400
26,27	12456	18641	2390	3832	2867	3586	628	807	18,341	26,866
మొత్తం	14957	21697	3500	5279	4470	5006	1108	1447	24,035	33,429

నీరుతాగిన నంది విగ్రహం!

- ఎయిర్ గ్యాప్‌తో పీల్చుకుంటుందంటున్న సైన్స్ టీచర్‌లు

నవతెలంగాణ-జుక్కల్


నంది రాతి విగ్రహానికి నీటిని పడుతున్న స్థానికులు

నందివిగ్రహం నీరు తాగిందనే వీడియో వైరల్ కావడంతో మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు శివాల యాలకు తరలివెళ్లి నంది విగ్రహానికి నీరు తాగించారు. వివరాల్లోకి వెళ్తే.. జుక్కల్ మండల కేంద్రంలోని శివాల యం వద్ద ఉన్న నంది విగ్రహం నీరు తాగిందనే వార్త, వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయింది. దీంతో పలు గ్రామాల్లో శివాలయాలకు గ్రామ స్తులు, ముఖ్యంగా మహిళలు తరలి వెళ్లారు. నీరు తాగించే ప్రయత్నం చేశారు. అయితే ఈ ఘటనపై సైన్స్ టీచర్‌లు స్పందించారు. చాలా రోజుల బండరాయిలో రంధ్రాలు ఏర్పడి ఎయిర్ గ్యాప్ ఉండటంతో గాలి లోపలికి లాగి నీరు ఇంకిపోతుందని, ఇలాంటి ఘటనలు తరుచూ జరుగుతుంటాయని పేర్కొన్నారు.

యువత చేపల వేట

- పంట పొలాలు నాశనం చేస్తున్నారని రైతుల ఆవేదన


చపలు పట్టుకునేందుకు వరిపొలంలో నుంచే వెళ్తున్న యువకులు

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండలం దూపల్లి పెద్ద చెరువు తూము ద్వారా బయటకు వస్తున్న నీటిలో చేపలు వస్తుండడంతో స్థానిక యువతతో పాటు, జాన్కంపేట్ పోచారం తదితర గ్రామాల నుంచి యువకులు వచ్చి చేపలు పడుతున్నారు. అయితే తమ పంటపొలాలు నాశనం చేస్తున్నారని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు బెదిరించినప్పటికీ యువత మాత్రం చేపల కోసం వరి పంటలో పరిగెత్తుతూ ఉండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఒక్కొక్క వ్యక్తి సంచుల నిండా చేపలను తీసుకువచ్చి రోడ్డుపై విక్రయించడం మొదలు పెట్టారు. తమ పంట పొలాల దగ్గర ఉండి చేపలు పట్టుకోవద్దని రైతులు నచ్చజెప్పినా వారు వినిపించుకోలేదు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కంటైనర్

ఒకరికి తీవ్ర గాయాలు.. 36 మంది ప్రయాణికులు సురక్షితం

నవతెలంగాణ-భిక్కనూర్



ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సు సడన్ గా బ్రేక్ వేయడంతో దాని వెనకాలే వస్తున్న కంటైనర్ వాహనం బస్సును ఢీ కొట్టిన్న ఘటనలో ఒకరికి తలకు తీవ్ర గాయాలు కాగా మరో 35 మంది సురక్షితంగా ఉన్నారు. వివరాలు తీలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి 36 మంది ప్యాసింజర్లతో బోధన్ కు బయలుదేరిన సూపర్ లగ్జరీ ఆర్టీసీ బస్సు బస్వాపూర్ గ్రామ సమీపంలోని 44 జాతీయ రహదారి సమీపంలోనికి రాగానే బస్సు డ్రైవర్ సడన్ గా బ్రేక్ వేయడంతో వెనకాలే వస్తున్న కంటైనర్ వాహనం బస్సును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ వారిని అంబులెన్స్‌లో మెదక్ జిల్లా రామయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మిగతా ప్రయాణికులను వేరే బస్సులో తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఆనంద్ గౌడ్ తెలిపారు.

ప్రాజెక్టులకు పోటెత్తుతున్న వరద

- నిజాంసాగర్, ఎస్సారెస్పీ గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల


ఎస్సారెస్పీ నుంచి ఉరకేస్తున్న గోదావరి..


నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఉప్పొంగుతున్న మంజీరా

నవతెలంగాణ-నిజామాబాద్

రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఎస్సారెస్పీతో పాటు నిజాంసాగర్ ప్రాజెక్టు భారీ ఎత్తున వరద నీరు వచ్చి చేరింది. శుక్రవారం సైతం గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

ఎస్సారెస్పీకి గురువారంతో పోల్చితే శుక్రవారం వరద కొంత మేర తగ్గింది. 7 గంటల సమయంలో 1.75 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా.. 18 గేట్లు ఎత్తి 58,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఉదయం 6 గంటల వేల 3 లక్షల 8 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరగా.. 30 గేట్లు ఎత్తి 3 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. సాయంత్రానికి వరద ఉధృతి తగ్గడంతో 18 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (90.3 టీఎంసీలు) కాగా, సాయంత్రం 7 గంటల సమయా నికి 1089.4 అడుగుల(81.69 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.

నిజాంసాగర్ ప్రాజెక్టు ఆరు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 45 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా.. 6 గేట్లు ఎత్తి అంతేస్థాయిలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నిజాంసాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 1405.0 అడుగులు(17.802 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 1404.66 అడుగుల(17.311 టీఎంసీల) నీరు నిల్వ ఉంది.

అలీసాగర్ మూడు గేట్లు ఎత్తివేత

ఎడపల్లి : గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఎడపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. అలీసాగర్ రిజర్వాయర్‌లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకుంది. జలాశయంలోకి నీటి ఇన్ ఫ్లో పెరగడంతో అధికారులు అప్రమత్తమై అలీసాగర్ జలశయం మూడు గేట్లను శుక్రవారం ఎత్తివేసి నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. ఈ క్రమంలో గేట్ల ద్వారా వదిలిన నీరు పంట పొలాలకు చేరి తానాకాలన్ గ్రామానికి చెందిన సూరాగంగామనీ. 30 గుంటల్లో వేసిన వరి పంట మొత్తం నీటిలో మునిగి ఉధృతికి కొట్టుకపోయి పూర్తిగా దెబ్బ తిన్నట్లు పొలం యజమాని తెలిపారు.

ముదిగొండ అమరవీరుల స్ఫూర్తిగా
భూ పోరాటాలు కొనసాగిస్తాం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు



నివాళి అర్పిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఖమ్మం జిల్లా ముదిగొండ ప్రాంతంలో పేదలకు ఇండ్ల స్థలాలు సాగు భూములు పంచాలని పోరాటం చేసిన సందర్భంలో అప్పటి ప్రభుత్వం భూ పోరాట కార్యకర్తల పైన కాల్పులు జరిపి ఏడుగురి ప్రాణాలను బలిగొన్నదని, వారి పోరాట స్ఫూర్తితో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా భూ పోరాటాలను మరింత పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు తెలిపారు. ముదిగొండ అమర వీరుల 16వ వర్ధంతి సందర్భం గా శుక్రవారం సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయం లో వారి చిత్రపటా నికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు మాట్లాడుతూ పాలకులు మారిన వారి విధానాలు మారటం లేదని పేదలకు నివసించడా నికి జానెడు జాగా ఇవ్వాలన్నా పాలకులకు మనసు పెట్టడం లేదని అన్నారు. పెట్టుబడిదారులకు వందల వేల ఎకరాలు కట్ట పెడుతూ కోట్లాది రూపాయలు రుణాల అందజేస్తూ పేదలకు మాత్రం ఇండ్ల స్థలాలు కానీ సాగు భూములు కానీ ఇవ్వటం లేదని ముదిగొండ అమరవీరుల స్ఫూర్తితో జిల్లాలో అనేక ప్రాంతాల్లో భూపోరాటాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నేటికీ వివిధ కేంద్రాల్లో భూ పోరాటాలు జరుగుతున్నా యని ప్రభుత్వం పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వటంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని ఇప్పటికైనా భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు చేయాలని ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చి డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు రుణాలు ఇవ్వాలని లేనియెడల ప్రజలు పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతారని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సుజాత, విగ్నేష్ నగర కమిటీ సభ్యులు కే రాములు, బాజిరెడ్డి అంజన్న, భాస్కర్, దీపిక, కళావతి పాల్గొన్నారు.

నీటిలోనే రాతి వంతెన

- సాలూర నుంచి అంతరాష్ట్ర రాకపోకలు బంద్

నవతెలంగాణ-బోధన్


రాతివంతెనపై నుంచి మంజీరా ప్రవాహం

భారీ వర్షాలు కురుస్తున్నందున సాలురా మంజీర నదికి ఇప్పటికే వరద నీరు అధికంగా చేరడం, అలాగే నిజాం సాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో వరద నీరు మంజీర నదికి భారీగా చేరింది. దాంతో బ్రిటిష్ కాలం నాటి రాతి వంతెన పూర్తిగా మునిగిపోయి రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. వాహనాల రాకపోకలకు ఉపయోగపడిన వంతెన వరదలో మునగడంతో అంతరాష్ట్ర రాకపోకలు బంద్ చేస్తూ గురువారం జాతీయ రహదారి విభాగం అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు బిలోలి, కొండల్వాడి, ధర్మాబాద్ మార్గంలో, ఇతర మార్గాల్లో వాహనాలు మళ్లించాలని పేర్కొన్నారు.

ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌తో మునిగిన పంటలు

- వరద ప్రవాహం పరిశీలించిన ఆర్డీవో


ఎస్సారెస్పీ బ్యాక్ బాటర్‌తో మునిగిన పంటపొలాలు పరిశీలన

నవతెలంగాణ-బోధన్

రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండటంతో గురువారం నిజాంసాగర్ ప్రాజెక్టు అధికారులు ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ లోకి వరద నీరు భారీగా చేరి బోధన్ మండలం హంగార్గ గ్రామంలోకి బ్యాక్ వాటర్ వస్తున్నాయి. దాంతో పంటలు మునిగి, వరద నీరు గ్రామం వైకుంఠధామం వరకు చేరుకున్నాయి. వరద ప్రవాహం గ్రామం సమీపంలో చేరడంతో శనివారం బోధన్ ఆర్డీఓ రాజాగౌడ్, తహశీల్దార్ వరప్రసాద్, ఎంపీడీఓ పర్బన్న హంగర్గ గ్రామాన్ని సందర్శించి పరిస్థితులను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. నిజాంసాగర్, మహరాష్ట్ర నుండి వరద కొనసాగుతున్నందున శ్రీరామ్ సాగర్ లోకి సుమారు లక్ష క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని దాంతో ఎస్ఆర్ఎస్పీ బ్యాక్ వాటర్ తో ఈ గ్రామ శివారులో పంటలు నీట మునిగాయని కావున ప్రాజెక్టు నుండి రెండు లక్షల క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేసి పంట పొలాలను కాపడాలని రైతులు ఆర్డీఓ కు విన్నవించారు. రైతుల కోరిక మేరకు తక్షణమే స్పందించిన ఆర్డీఓ రాజాగౌడ్ ప్రాజెక్టు ఎస్ఈ కి ఫోన్ లో శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ నుంచి 2లక్షలు నీటిని విడుదల చేయాలనీ ఆదేశించారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు బుద్దె రాజేశ్వర్, డీసీసీబీ డైరెక్టర్ జి. శరత్, సంజీవ్ కుమార్, పార్టీ సాలూర మండల బాధ్యులు జి.నర్సయ్య, ఏఎంసీ వైస్ చైర్మెన్ సాలూరా షకీల్, శ్యామ్ రావు గంగాధర్, శివ కుమార్, లతీఫ్ తదితరులు ఉన్నారు.

గండివేట్.. పీర్లపండుగలో ప్రత్యేకత

మతసామరస్యం చాటుతున్న గ్రామస్తులు

నవతెలంగాణ-గాంధారి


(ఫైల్)

గాంధారి మండలంలోని గండివేట్ గ్రామంలో పీర్ల పండుగ ప్రత్యేకతను సంతరించుకుంది. ఇక్కడి గ్రామస్తులు మతసామరస్యం చాటడమే కాకుండా ఊరంతా కలిసి ఉత్సాహంగా పండగను నిర్వహిస్తుంటారు. దీంతో ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్నాటక నుంచి సందర్శులకు వస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేస్తుంటారు.

కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని గండివేట్ గ్రామంలో పీర్ల పండుగ ఉమ్మడి జిల్లాలో మరెక్కడా లేనివిధంగా గ్రామస్తులంతా కలిసి నిర్వహించుకుంటారు. మొహారం నెల వచ్చిందంటే ఊరు ఊరంతా కులం మతం అనే తేడా లేకుండా నియమనిష్టలు పాటిస్తారు. గండివేట్‌లోని అదిరాఖానాలో కొలువై ఉన్న కాసిం దూలలను ఆరాధిస్తారు. గ్రామంతో అనుబంధం ఉన్నవారు ఎక్కడ ఉన్నా మొహరం నెలలో జరిగే ఖాసిం దూల సవారీ చూసేందుకు తప్పకుండా వస్తారు. కాసిం దూల పేరు వచ్చేలా కాశీరాం, కాశీనాథ్, క్రాంతి తదితర పేర్లు గ్రామస్తులు వారి పిల్లలకు పెట్టుకోవడం ఇక్కడ విశేషం.

61 ఏండ్లు నిబంధన తొలగించాలి : వీఆర్ఏలు

నవతెలంగాణ-మోపాల్

61 ఇళ్ల నిబంధనను తొలగించాలని వీఆర్ఏలు కోరారు. మండల కేంద్రంలో ఆరుగురు వీఆర్ఏలు ఆరోగ్యం సమస్యలతో చాలా ఇబ్బంది పడుతున్నారని, వారికి 55 ఏళ్లకే నిబంధన సరి చేయాలని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని, మోపాల్ వీఆర్ఏ ల సంఘం మండల అధ్యక్షుడు సాయినాథ్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. 61 ఏళ్ల నిబంధన వల్ల వారి వారసులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, 61ఏండ్ల సడలింపు నుండి 55 సంవత్సరాల తగ్గించాలని కోరారు.

నిరాశ్రయులకు అన్నదానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలకేంద్రంలో భారీ వర్షాల మూలంగా నిరాశ్రయులైన నిరుపేదలకు కమ్మర్ పల్లి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రెండవ రోజు అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగించారు. భారీ వర్షాల మూలంగా నువ్వు తట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరడంతో పలువురికి వంట చేసుకుని తినలేని పరిస్థితి ఏర్పడింది. స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు నిరాశ్రయులకు ఆహారం అందించేందుకు రఘు హెూటల్ వద్ద సభ్యులు స్వయంగా వంట చేసి భోజనాన్ని అందించారు. మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన రాజ్ వీర్ తనవంతుగా 25కిలోల బియ్యాన్ని శుక్రవారం విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో చిటికేసి రఘు, కొత్తపల్లి గణేష్, జోగ గంగాధర్, సున్నం మోహన్, గణపురం రవి, కీర్తి నాగరాజు, నరేందర్, యమ శ్రీనివాస్, రాజ్ వీర్, మంగలి రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

30న నీట్ ర్యాంకర్లకు సత్కారం

నవతెలంగాణ ఆర్మూర్



నీట్ ఫలితాల్లో 5వేలలోపు ర్యాంకు వచ్చిన విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ ప్రమాణ స్వీకారం సందర్భంగా సత్కారం చేస్తున్నట్టు అధ్యక్షులు గోపికృష్ణ పట్వారి శుక్రవారం తెలిపారు. రోటరీ ఆధ్వర్యంలో ఆదివారం ు పట్టణంలోని పెర్కిట్ ఎమ్. ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో సత్కారం ఉంటుందని పేర్కొన్నారు. ర్యాంకు కార్డు వివరాలు తన నంబర్ 9490901007 కి పంపాలని తెలిపారు.

ఆహార పొట్లాల పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

ఇటీవలే కురిసిన భారీ వర్షాలకు నియోజకవర్గ పరిధిలో లోతట్టు ప్రాంతాల ప్రజల్లు నీటి ఎద్దడి తో తీవ్ర ఇబ్బంది పడుతున్న సందర్భంగా శుక్రవారం 'జీవనన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారికి ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న నారాయణ కళాశాల

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న నారాయణ కళాశాలను టివియువి, ఎఐయస్‌బి నాయకులు శుక్రవారం బంద్ చేయించారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక (టీవీయూవీ), ఏఐయస్‌బి ఆధ్వర్యంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న నారాయణ కళాశాలను బంద్ చేయించారు. టివియువి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్‌సింగ్, ఎఐఎస్‌బి రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేష్ రెడ్డి మాట్లాడుతూ.. భారీ వర్షాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సెలవులు ప్రకటించిన ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నారాయణ కళాశాల యాజమాన్యం మాత్రం అవేవి తమకు పట్టవంటూ ఆ కళాశాల మాత్రం తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వర్షంలో సైతం విద్యార్థులు కళాశాలకు రావాలంటే ఇబ్బందులకు గురి అవుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారని అన్నారు. కళాశాల యాజమాన్యం పిల్లలను తరగతులకు పంపాలని వేధిస్తున్న ఆ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం

- ఎమ్మెల్యే బిగాల
- ముంపు ప్రాంతాలు పరిశీలన



ముంపుప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బిగాల

నవతెలంగాణ-కంఠేశ్వర్

భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాలను అధికారులతో కలిసి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా శుక్రవారం పరిశీలించారు. న్యాల్‌కల్ రోడ్డు, రోటరీ నగర్, లలిత నగర్, భవాని నగర్, అయోధ్య నగర్, త్రివర్ణ గణేష్ కాలనీలను పరిశీలించి స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా మాట్లాడుతూ.. వరద నీటిని మళ్లించేందుకు 2 కోట్ల రూ.లతో స్టోర్ వాటర్ డ్రైనేజ్‌ని నిర్మించామని తెలిపారు. వరద నీరు ఎక్కడా ఆగకుండా డ్రైనేజీలు, కల్వర్టులు నిర్మించామని చెప్పారు. వర్షం పడితే ఎల్లమ్మ గుట్ట, రైల్వే కమాన్ వద్ద ట్రాఫిక్ సమస్య ఏర్పడేదని, ట్రాఫిక్ సమస్య అధిగమించడానికి రైల్వే కమాన్ వద్ద ఆర్‌యూబి నిర్మించామని తెలిపారు. నిజామాబాద్ నగరంలోని ప్రతి డివిజన్ కి (టీయూఎఫ్ఐడిసి) ద్వారా కోటి రూపాయలు మంజూరు చేశామని అన్నారు. వర్షాకాలం ప్రారంభంలోనే అన్ని డ్రైనేజి లను డి-సిల్టేషన్ ప్రక్రియను పూర్తిచేశామని, భారీ వర్షాల కారణంగా దెబ్బ తిన్న రోడ్లను త్వరలోనే మరమ్మతులు చేస్తామని తెలిపారు. ముంపు ప్రాంతాల్లో నీటిని మళ్లించేందుకు కచ్చ నాలాలు తవ్వుతున్నామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టామని అన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసామని, వాటిలో భోజన వసతి, మంచి నీటి వసతి కల్పించామని తెలిపారు. వరద తగ్గు ముఖం పట్టే వరకు పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందాలన్నారు. ప్రజల సహాయార్థం నగర పాలక సంస్థ కేంద్ర కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. 08462-221001 నంబర్‌కు కాల్‌చేసి సహాయం పొందాలన్నారు. శిథిల భవనాల్లో ఉంటే వెంటనే పునరావాస కేంద్రాలకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతు కిరణ్ , కార్పొరేటర్లు పట్నం విక్రమ్ గౌడ్, సుక్క మధు,ధర్మపురి, బీఆర్ఎస్ నాయకులు యెనుగందుల మురళి, నరేందర్ గౌడ్,కంచర్ల సంతోష్, గారిపల్లి ప్రవీణ్,గాండ్ల లింగం,అనిల్ రావు, పుప్పాల రవి, చింతకాయల రాజు, నర్సింగ్, మున్సిపల్ అధికారులు సాగర్, మురళి, రషీద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

- అరుణాచలం వెళ్తుండగా.. మృతిచెందిన ఆర్మూర్ వాసి

నవతెలంగాణ-ఆర్మూర్

దైవ దర్శనానికి అరుణాచలం వెళ్తుండగా మార్గమధ్యలో కాంచీపురం వద్ద చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఆర్మూర్ వాసితో పాటు మరో వ్యక్తి దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళ్తే.. ఆర్మూర్ పట్టణంలోని లోని జర్నలిస్టు కాలనీలో నివసించే ఉప్పునూతల రమేష్‌గౌడ్, ఆయన కుమారుడు అవినాష్ గౌడ్ (24) హైదరాబాద్ లోని స్నేహితుడు వెంకట్ రెడ్డి, ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన నర్సింగ్, గంగాధర్ గౌడ్, పట్టణంలోని టీచర్ కాలనీకి చెందిన గటడి బద్రీనాథ్ తమిళనాడు లోని అరుణాచలంలో దైవదర్శనానికి కారులో బయలుదేరారు. దర్శనాలు చేసుకుంటూ వెళ్తుండగా.. శుక్రవారం తమిళనాడులోని కాంచీపురం జిల్లా బానవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు వీరి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేష్ గౌడ్ కుమారుడు అవినాష్ గౌడ్, హైదరాబాద్‌కు చెందిన స్నేహితుడు వెంకట్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలైన రమేష్ గౌడ్, గటడి బద్రీనాథ్, నర్సింగ్, గంగాధర్‌గౌడ్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం చెన్నై లోని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం సంఘటన తెలియగానే కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతదేహాలను ఆర్మూర్‌కు తీసుకురావడానికి రమేష్ గౌడ్ స్నేహితులు కాంచీపురానికి బయలుదేరారు. ఈ ప్రమాద సంఘటన తెలియగానే ఆర్మూర్ పట్టణంలోని పలువురు రమేష్ గౌడ్ స్వగృహానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పట్టణంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి..

ఎకరానికి 20వేల నష్ట పరిహారం చెల్లించాలి

- టిపిసిసి అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్
- వర్షాలకు నష్టపోయిన పంటలు పరిశీలించిన అధికారులు, నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



కమ్మర్‌పల్లి:మాట్లాడుతున్న వేణుగోపాల్‌యాదవ్

జిల్లాలో వరుసగా కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకొని, తక్షణమే ఎకరానికి రూ.20 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని టిపిసిసి అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆ పార్టీ మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో దాదాపు 300 ఎకరాల పంట నష్టం జరిగిందని అధికారులు పర్యవేక్షించిన నివేదికలో తేలిందని, ఆ నివేదిక ప్రకారమే నష్టపరిహారం అందజేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. జిల్లాలో రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యి ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నందున జిల్లాకు చెందిన రోడ్లు భవనాల శాఖ మంత్రిగా ప్రశాంత్ రెడ్డి తక్షణమే నిధులు కేటాయించి రోడ్ల మరమ్మత్తులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వర్షాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పడుతున్న బాధలను తెలుసుకోవాలని వెళ్తున్న మీడియాను, రాజకీయ నాయకులను రానీయ వద్దంటూ కేసీఆర్ ప్రభుత్వం డిఈఓ లకు ఆదేశాలను జారీ చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుంకేట రవి, నాయకులు బుచ్చి మల్లయ్యా యాదవ్, సల్లూరి గణేష్ గౌడ్, పత్తిరి రవి, తక్కురి శేఖర్, సుంకేట శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్ గ్రామంలో భారీ వర్షాలకు పొలంలో ఇసుక మేటలు వేసిన రైతుల పంట పొలాలను భీంగల్ ఏడిఏ కాంపాటి మల్లయ్య శుక్రవారం పరిశీలించారు. వ్యవసాయ విస్తీర్ణ అధికారిని పద్మతో కలిసి పంట పొలాలను పరిశీలించిన ఆయన రైతులతో మాట్లాడారు. పంట నష్టాన్ని ప్రాథమిక అంచనా వేసి నివేదికను జిల్లా వ్యవసాయ శాఖకు అదేవిధంగా రైతులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఉప్లూర్, కొన సముదర్, కమ్మర్‌పల్లి క్లస్టర్‌లలో ఉన్న గ్రామాల్లో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు పంట నష్టం అంచనా వేయడానికి పర్యటిస్తున్నట్లు తెలిపారు. పంట నష్టం అంచనా వేయడానికి క్షేత్ర స్థాయిలో పంట పొలాలను పరిశీలించి ప్రాథమిక నివేదికను తయారు చేస్తున్నారన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



నవీపేట్: నీటమునిగిన పంటలను పరిశీలిస్తున్న నాయకులు



వేల్పూర్: పంటను పరిశీలిస్తున్న అధికారులు

నవీపేట్: భారీ వర్షాల కారణంగా నీట మునిగిన పంటలను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. మండలంలోని నాలేశ్వర్, లింగాపూర్ గ్రామాలలో కాలువలు, పంట పొలాలకు వెళ్లే దారులు తెగిపోవడంతో రైతుల పంటలు పూర్తిగా నీట మునిగి పోగా పరిశీలించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అధికారులతో సర్వే చేసి పంట నష్టాన్ని అందించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడం వల్లనే రైతులు ప్రతిసారి నష్టపోతున్నారని అన్నారు. అంతకుముందు పోతంగల్ గ్రామంలో పునరావాస కేంద్రంలోని నిరుపేదలకు బియ్యం బస్తా అందించారు. కార్యక్రమంలో నాయకులు ముప్వ నాగేశ్వర్ రావు, పార్టీ అధ్యక్షులు, సర్పంచ్ సరీన్, ఆనంద్, సత్యం రెడ్డి, గణేష్, రాజేందర్ గౌడ్, గంగాధర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: మూడు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు మండలంలో దెబ్బతిన్న పంటలను శుక్రవారం మండల వ్యవసాయాధికారి రాజ్ కుమార్ పరిశీలించారు. మండలంలోని వెంచిర్యాల గ్రామంలో పెద్దవాగు ఉధృతి కారణంగా అత్యధికంగా 320 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని గుర్తించామని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పంటనష్టం వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదించడం జరుగతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజ్ కుమార్, సర్పంచ్ మట్ట సందీప్, గ్రామ రైతుబంధు కమిటీ అధ్యక్షులు నిమ్మల నర్సయ్య, ఏఈవో నిషికాంత్, రైతులు పాల్గొన్నారు.

పంట నష్టం వివరాలుసేకరణ

వేల్పూర్: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయ అధికారి పరిశీలించారు. మండలంలో సుమారు వరి పంట 2570 ఎకరాలు, మొక్కజొన్న 1810 ఎకరాలు, సోయా 1570 ఎకరాలు, పసుపు 640 ఎకరాలుగా ప్రాథమిక అంచనా వేసి నివేదిక అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బీమా జమున రాజేందర్, వైస్ ఎంపీపీ సురేష్, వేల్పూర్ సర్పంచ్ రాధ మోహన్, వెంకటాపూర్ సర్పంచ్ మహేష్, యంఏఓ నర్సయ్య , ఏఈఓ నిఖిల్, రైతులు పాల్గొన్నారు.

భీంగల్ ఎడతెరిపి లేకుండ కురిసిన వర్షాల వల్ల మండలంలోని పలు గ్రామాల్లో తీవ్ర పంట నష్టం సంభవించింది. కప్పలవాగుకు ఆనుకొని ఉన్న పొలాల్లో ఇసుక మేటలు పెట్టడంతో పంట నష్టం తీవ్రంగా జరిగింది. దీంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. శుక్రవారం మండలంలోని భీంగల్, సికింద్రాపూర్, బడా భీంగల్, ముచ్కూర్ గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారి సాయికృష్ణ ఆధ్వర్యంలో నష్టపోయిన పంటలను పరిశీలించారు. మండలంలో ఇప్పటికి 2500 ఎకరాల్లో వరిపంట, 50 ఎకరాల్లో మొక్కజొన్న, 50 ఎకరాల్లో సోయ పంట నష్టపోయినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా నష్టపోయిన రైతుల జాబితాను గుర్తించారు. ఈ పరిశీలనలో ఏఈఓలు లక్‌పతి, ప్రవీణ్, మౌనిక తదితరులున్నారు.

పంటలను పరిశీలించిన బిజెపి నాయకులు

వర్షాలకు దెబ్బతిన్న పంటలను బిజెపి జిల్లా నాయకుడు మల్లికార్జున్‌రెడ్డి మండల నాయకులతో కలిసి పరిశీలించి బాధితుల నుండి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. చెక్ డ్యాంలు బీఆర్ఎస్ నాయకుల లబ్ధికోసమేనని రైతులకు నష్టం చేసేవని తెలిపారు

హాస్టళ్లకు పక్కాభవనాలను నిర్మించకపోతే ఉద్యమిస్తాం

- ఎస్ఎఫ్ఐ నాయకుల స్పష్టీకరణ
- సమరభేరి సంక్షేమ జీపు జాత రావూజీ సంఘం గర్ల్స్ హాస్టల్ వద్ద ముగింపు

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న విఘ్నేష్

సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు పక్కా భవనాలను నిర్మించకపోతే ఉద్యమం తప్పదని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ సమరభేరి సంక్షేమ జీపుజాత రావోజి సంఘం గర్ల్స్ హాస్టల్ వద్ద ముగింపు వర్ని నుండి నిజామాబాద్‌కు ఏడవ రోజుకు చేరిన ఎస్ఎఫ్ఐ యాత్ర బృందం అని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విగ్నేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) సంక్షేమ హాస్టళ్ల పరిరక్షణకు జీపుజాత ఇంటిగ్రేటెడ్ న్యాల్కల్ హాస్టల్ నుండి ప్రారంభించి రావూజీ సంఘం గర్ల్స్ హాస్టల్ వద్ద యాత్ర ముగిసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విఘ్నేష్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం సంక్షేమ హాస్టల్లపై శ్రద్ధ పెట్టడం కరువైందని అన్నారు. నిజామాబాద్ జిల్లాలోనీ ప్రభుత్వ హాస్టళ్లలో సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్లో మినరల్ వాటర్ ప్లాంట్లను మరమ్మత్తులు చేయకపోవడంతో జనరల్ వాటర్‌తో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయని వెంటనే సంక్షేమ హాస్టళ్లకు మెంటల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెంచిన మెస్ చార్జీలను జూలై నుండి అమలు చేస్తానన్న కేసీఆర్ మాట నిలబెట్టుకోవాలని అన్నారు. గర్ల్స్ హాస్టల్ లకు ప్రత్యేకంగా హెల్త్ కిట్స్ అందించాలని. హాస్టల్లో అప్లికేషన్ పెట్టిన ప్రతి విద్యార్థికి సీట్లు అందించేటట్టుగా ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. కొన్ని అద్దె భవనాలు వర్షాలతో వరుస్తున్నాయని, పెచ్చులు ఊడిపోతున్నాయని వాటికి ఉన్నతాధికారులు మరమ్మతులు జరపాలని అన్నారు. సంక్షేమ హాస్టళ్లను ప్రజా ప్రతినిధులు సందర్శించి సమస్యలను పరిష్కరించాలని అన్నా రు. జిల్లాలో మహిళలకు ప్రత్యేకంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను నిర్మించాలని అదనంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ హాస్టల్లకూ పక్కా భవనాలు నిర్మించాలని డిమాండ్‌చేశారు. హాస్టల్స్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఐదు నెలలు గడుస్తున్నా ఏజెన్సీలు డబ్బులు ఇవ్వకపోవడం సరికాదని అన్నారు. లేకపోతే భవిష్యత్తులో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, మహేష్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు దీపిక, జిల్లా నాయకులు జవహర్, గణేష్, సంధ్య రెడ్డి, అరవింద్, శివ, బాబురావు తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంలో అన్ని రోగాలకు మందులు

డాక్టర్ లలిత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఆయుర్వేదంలో అన్ని రోగాలకు మందులు ఉన్నాయని మండల ఆయుర్వేద డాక్టర్ లలిత అన్నారు. మండలంలోని పుప్పాలపల్లి గ్రామంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లలిత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆయుర్వేదం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. దీర్ఘకాలిక రోగాలు, రక్తపోటు, మధుమేహం, కీళ్ల నొప్పులు, స్త్రీలకు రుతుక్రమానికి సంబంధించిన వ్యాధులు, చర్మ రోగాలకు, అజీర్ణం, పక్షవాతం వంటి మరెన్నో రోగాలకు మందులు ఆయుర్వేదంలో ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దావుల పోసాని, ఎంపీటీసీ అంకం లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రాజేష్, సంతోష్, ప్రకాష్, ఫార్మాసిస్టు సిహెచ్ వరలక్ష్మి, ఎస్ఎస్ఓ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు నిత్యవసర సరుకులు పంపిణీ

నవతెలంగాణ-భీంగల్

ఇటీవల కురిసిన వర్షాలకు నిరాశ్రయలైన పిప్రి గ్రామంలోని 20 కుటుంబాలకు కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్‌రెడ్డి నిత్యావసర సరుకులు శుక్రవారం పంపిణీ చేశారు. బాల్కొండ నియోజకవర్గంలో భారీ వర్షాల నేపథ్యంలో ఏ ఒక్కరు ఆకలితో ఉండకూడదనే ఉద్దేశ్యంతో ఈకార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సునీల్‌రెడ్డి అనుచరులు తెలిపారు.

మసీద్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-గాంధారి



ఎన్నికైన కమిటీ సభ్యులు

గాంధారి మండల కేంద్రంలోని రెండు మసీదుల సదర్‌ను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా(సదర్) సయ్యద్ ముస్తఫా, జనరల్ సెక్రెటరీ గౌస్ ,వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ సత్తార్, మహమ్మద్ అక్సర్, కోశాధికారి గా సయ్యద్ జాకీర్ అలీ ఏకగ్రీవంగా ఎన్నుకునట్లు మసీదు కమిటీ సభ్యులు తెలిపారు.

పేదలకు కష్టం వస్తే ముందుంటా

- ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న ధన్‌పాల్

పేదలకు కష్టంవస్తే ఎల్లప్పుడూ ముందుంటానని బీజేపీ రాష్ట్ర నాయకులు ధన్పాల్ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం నిజామాబాద్ నగరంలోని 38వ, 22వ, 34వ డివిజన్‌లలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దన్పాల్ సూర్యనారాయణ పర్యటించారు. 38వ డివిజన్‌లో భారీ వర్షానికి కొన్ని ఇండ్లు కూలిపోయాయని సమాచారం తెలుసుకొని అక్కడి కార్యకర్తలతో కలిసి వారి నివాసానికి వెళ్లి ఆత్మీయంగా పలకరించారు. 15 రోజులకు సరిపడే నిత్యావసర సరుకులు, వారికి తక్షణ ఆర్థిక సాయంగా కొంత డబ్బులు అందజేశారు. ఈ సందర్భంగా ధన్పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. పేదలకు కష్టం వస్తే నియోజకవర్గంలో ఎల్లప్పుడూ ముందుంటానని అన్నారు. ప్రజాప్రతినిధుల్లాగా ఫొటోలకు ఫోజులు ఇవ్వబోమని అన్నారు, పేదల గోస ప్రజాప్రతినిధులు మనకు అవసరమా.. అని ఎమ్మెల్యే బిగాలను పరోక్షంగా విమర్శించారు. డబుల్ బెడ్ రూం లు, సొంత జాగా ఉన్న వారికి ఐదు లక్షల ఇస్తానని చెప్పి అందజేసి ఉంటే వారికి ఈ కష్టాలు వచ్చేవే కావు అని అన్నారు. ఎమ్మెల్యే బీగాల తూతూ మంత్రంగా అధికారులను వెంటేసుకొని వచ్చి ఏదో చేసినట్టు చెప్పుకోవడం కాదు.. ప్రజల సమస్యలు తీర్చాలని అన్నారు. 22వ డివిజన్లో నూతనంగా వేసిన రోడ్డు కొన్ని రోజులకే 10 ఫీట్ల లోతుగా గుంతగా తయారై కూరుకు పోయిందన్నారు. దాన్ని పరిశీలించి నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ యాదిరెడ్డికి ఫోన్లో మాట్లాడి సమస్యను వివరించారు. వెంటనే పనులు ప్రారంభించాలని లేకపోతే ఈ రోడ్డు విషయంలో స్థానికలతో కలిసి పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గోపిడి స్రవంతి రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పంచారెడ్డి లింగం, జిల్లా ఉపాధ్యక్షులు నాగొల్ల లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షులు గడ్డం రాజు, కార్పొరేటర్లు పంచ రెడ్డి శ్రీధర్, మాస్టర్ శంకర్, ఎర్రం సుధీర్, బూరుగుల వినోద్ బిజెపి నాయకులు పాల్గొన్నారు.

పంటలు సంమృద్ధిగా పండాలి : జడ్పీటీసీ జగన్

నవతెలంగాణ-ధర్పల్లి



ప్రత్యేక పూజలు చేస్తున్న బాజిరెడ్డి జగన్

భారీ వర్షాలతో ధర్పల్లి ఊర చెరువు నిండి అలుగు పడుతుండటంతో శుక్రవారం జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్ మోహన్ అలుగు వద్ద ఆనవాయితీ ప్రకారం ప్రత్యేక పూజలు చేశారు. పంటలు సంవృద్ధిగా పండి, రైతులు, గ్రామప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరారు. అనంతరం ఇటీవల మండల కేంద్రంలో నూతనంగా ఏర్పడ్డ గ్రామకమిటీ సభ్యుల ప్రత్యేక ఆహ్వానం మేరకు కమిటీని సందర్శించగా కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నుకోబడ్డ కమిటీ సభ్యులకు ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో అన్ని వర్గాలకు కలుపుకొని సమిష్టిగా అభివృద్ధికి సహకరించాలని కోరారు. మరో వారం రోజుల్లో సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభం కానున్నాయని, అలాగే 100 పడకల ఆసుపత్రి పనులు జరగనున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి, మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, సర్పంచ్ ఆర్మూర్ పెద్ద బాల్‌రాజ్, సొసైటీ చైర్మెన్ మల్లికార్జున్, రాజ్పాల్, విడిసి అధ్యక్షుడు అరుగుల రాజేశ్వర్, నాయకులు లింబా గౌడ్, లాల గౌడ్ శ్రీనివాస్, రాజేందర్, అబ్దుల్ మజీద్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ పండ్ల మొక్కల పంపిణీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామంలో శుక్రవారం ఇంటింటికీ పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ సక్కారం అశోక్ ఆధ్వర్యంలో స్థానిక మహిళ సంఘ భవనంలో మహిళ సంఘాల సభ్యులకు ఒక్కొక్కరికి మూడు నుండి ఐదు పండ్ల మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో కనీసం మూడు మొక్కలనైనా నాటాలన్నారు. వాటి రక్షణకు ఏర్పాట్లు చేయాలని సూచించారు కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి బాగేంద్ర, ఈజీఎస్ ఏపీవో విద్యానంద్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ మారుతీ, ఫీల్డ్ అసిస్టెంట్ రాజు, సెర్ప్ సీసీ భాగ్యలక్ష్మి, సిఏలు, గ్రామ మహిళ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పునరావాసం ఏర్పాటు

మానవతను చాటుకున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి

నవ తెలంగాణ-నిజామాబాద్‌రూరల్

నాలుగో డివిజన్ పరిధిలోగల సత్యనారాయణ గుడి పరిసర ప్రాంతాల్లో రెండు వాగుల మధ్య గల గుడిసెల్లోకి నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు పొంగి ఇంట్లోకి నీరు రావడంతో స్థానిక ఆర్యనగర్ ఈస్ట్ బ్యాంక్ కాలనీ కమ్యూనిటీ హాల్లో పునరావాసం కల్పించారు. రూరల్ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ సూచనలు మేరకు వారిని పునరావాస కేంద్రానికి తరలించి భోజన వసతి ఏర్పాటు చేశారు. డివిజన్ అధ్యక్షులు నాగళ్ళ శ్రీకాంత్ చౌదరి, బిసి అధ్యక్షులు మల్లెపూల నరసింహ చారి, నవీన్ కుమార్, టీఆర్ఎస్‌వి ఉపాధ్యక్షులు అభిలాష్ భీమ్ శంకర్, హైమత్, సీనియర్ నాయకులు సాయన్న, వినోద్ కుమార్ పరామర్శించారు.

బాగేపల్లి గ్రామాన్ని సందర్శించిన వైద్య బృందం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బాగేపల్లి గ్రామపంచాయతీలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈనెల 27న కురిసిన భారీ వర్షాలకు ఇండ్లు శిథిలావస్థకు చేరుకున్న బాధిత కుటుంబాలకు స్థానిక పాఠశాలలో సర్పంచ్ పాముల సాయిలు, గ్రామ కార్యదర్శి శ్రీకాంత్ పునరవాసం కల్పించారు. వైద్య బృందం ఆ గ్రామాన్ని సందర్శించి పాఠశాలలోనున్న ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురికి వైద్య పరీక్షలు నిర్వహించి వారందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పాముల సాయిలు, డాక్టర్ వినయ్ కుమార్, ఆరోగ్య విస్తీర్ణ అధికారులు శ్రావణ్ కుమార్, కరిపే రవీందర్, ఆరోగ్య కార్యకర్త భాగ్యమ్మ గ్రామ కార్యదర్శి శ్రీకాంత్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

త్వరలో చిల్డ్రన్ పార్కు ప్రారంభం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

గత 30 సంవత్సరాల నుంచి ఎల్లారెడ్డి పట్టణంలో చిల్డ్రన్ పార్కు ఏర్పాటు చేస్తామని గతంలో పాలించిన నాయకులు పదేపదే చెప్పినప్పటికీ వారు నెరవేర్చలేకపోయారని, స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ చిల్డ్రన్ పార్కు ఏర్పాటు చేయించారని ప్రారంభించడానికి సిద్ధంగా ఉందని మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం చిల్డ్రన్ పార్క్‌లో ఏర్పాటు చేసిన వివిధ ఆట వస్తువులను ఆయన పరిశీలించారు. త్వరలోనే ఈ పార్క్ స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ ప్రారంభిస్తారని తెలిపారు. సుమారు 70 లక్షల వ్యయంతో ఈ పార్క్ నిర్మించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీవన్, తిమ్మాపూర్ సర్పంచ్ మామిడి దామోదర్, బీఆర్ఎస్ నాయకులు శ్రవణ్ కుమార్ రాజు, ఇమ్రాన్, మనోజ్ తదితరులున్నారు.

కార్మికుల ప్రయోజనమే ముఖ్యం

- ప్రభుత్వం జీపీ కార్మికుల సమస్యల పట్ల మొండి వైఖరి వీడాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు
- 23వ రోజుకు పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె

నవతెలంగాణ-విలేకరుల బృందం


బోధన్ : సమ్మెలో మాట్లాడుతున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు


కోటగిరి : సమ్మెలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

బోధన్ : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు గత 23 రోజులుగా వర్షాన్ని సైతం లెక్కచేయక సమ్మె చేస్తున్నారని, అయినా ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గ్రామపంచాయతీ కార్మికులతో చర్చలు జరిపి వారి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. శుక్రవారం బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో సమ్మెలో ఉన్న పంచాయతీ కార్మికులకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం తమ నిర్లక్ష్య వైఖరిని వీడనాడి కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం వెంటనే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో వర్షభావ పరిస్థితుల వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల ఆరోగ్యం దెబ్బతినకుండా ఉండాలంటే కార్మికులు విధుల్లో చేరాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని అయినా ప్రభుత్వం వెంటనే గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ, లేదా ప్రభుత్వ జీవోకు అనుగుణంగా గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని ఆయన డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాజంలో ఎవరికీ లేని మల్టీపర్పస్ విధానాన్ని గ్రామపంచాయతీ కార్మికులకు అమలు జరపటం రాజ్యాంగ విరుద్ధమని ఆయన అన్నారు. అందువల్ల ప్రభుత్వం తమ వర్గ ప్రయోజనాలను చూసుకోవటమే కాకుండా కార్మిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సమస్యలు పరిష్కరించాలని అన్నారు. లేనియెడల భవిష్యత్తులో జరగబోయే పరిణామాలకు ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బోధన్ ఏరియా కమిటీ కార్యదర్శి వై.గంగాధర్, గ్రామ పంచాయతీ యూనియన్ మండల నాయకులు సాగర్, రేఖ, సతీష్, లక్ష్మి, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

జీవో నెంబర్ 60 అమలు చేయాలి..

కోటగిరి : ఉమ్మడి మండలంలోని పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. కార్మికులకు సీఐటీయూ ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, సీఐటీయూ ఉపాధ్యక్షులు గోవర్ధన్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం పక్కన పెట్టాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, 60వ నెంబర్ జీవో అమలు చేయాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 23 రోజులు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం పంచాయతీ కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. కరోబార్లు, బిల్ కలెక్టర్లు, ఎలక్ట్రీషన్ సిబ్బందికి జూనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ ఇవ్వాలని, మల్టీపర్పస్ విధాన రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకూ ఉద్యమం ఆపేది లేదని పేర్కొన్నారు. అనంతరం ప్రమాదాన్ని గురైన పోతంగల్ పంచాయతీ కార్మికురాళ్లను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎటువంటి ప్రలోభాలకి పంచాయతీ కార్మికులు గురికావొద్దని, పోరాడితే పోయేదేమీ లేదని, న్యాయపరమైన డిమాండ్లు అడుగుతున్నామని బంగారు తెలంగాణలో మనం అనుభవిస్తున్న కష్టాలను ప్రభుత్వం గుర్తించి సమస్యలు సత్వరమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ కార్మిక అధ్యక్షురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే షిండేకు వినతి..

మద్నూర్ : మండలంలోని పెద్దఎక్లరా గేటు వద్ద నూతనంగా మంజూరైన విద్యుత్ సబ్‌స్టేషన్ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే హనుమంతు షిండేకు సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సురేష్ గొండ ఆధ్వర్యంలో మద్నూర్ మండలంలోని వివిధ గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. డిమాండ్లతో కూడిన ఒక వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సురేష్ గొండ మాట్లాడారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో మద్నూర్ కార్మిక సంఘం మండలాధ్యక్ష కార్యదర్శులు ఎం.తులసిరామ్, జై.మారుతి కార్మికులు పాల్గొన్నారు.


మద్నూర్ : ఎమ్మెల్యే షిండేకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు


వర్ని : మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సమ్మెకు సంఘీభావం తెలిపిన కాంగ్రెస్ నాయకులు..

జుక్కల్ : మండల కేంద్రంలో చేపట్టిన జీపీ కార్మికుల సమ్మెకు కాంగ్రెస్ నాయకులు తోట లక్ష్మి కాంతరావ్, పెద్దఎడ్గి సర్పంచ్ అస్పత్‌వార్ వినోద్, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి దీక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తోట లక్ష్మికాంతారావ్ మాట్లాడుతూ.. జీపీ కార్మికుల సమ్మెకు తాము పూర్తిగా మద్దతు తెలుపుతున్నామని వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మాజీ ఎంపీటీసీ ఇమ్రాన్, సీఐటీయూ నాయకులు సురేష్ గొండ తదితరులు పాల్గొన్నారు.

వర్ని (చందూర్, మోస్రా) : తెలంగాణ రాష్ట్రంలో కార్మికులకు, ఉద్యోగులకు అడుగడుగునా కష్టాలే ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు యలమంచిలి శ్రీనివాస్‌రావు, మండల అధ్యక్షులు పోతారాజు శ్రీనివాస్, వర్ని మండల అధ్యక్షులు సురేష్ బాబా, డెలిగేట్ రాజారెడ్డి విమర్శించారు. చందూర్ మండల కేంద్రంలో జీపీ కార్మికుల సమ్మెకు మద్దతుతెలిపారు. కార్యక్రమంలో గిరిజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రతాప్‌సింగ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

23వ రోజు పారిశుధ్య కార్మికుల సమ్మె

రెంజల్ : తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న కార్మికుల నిరవధిక సమ్మె 23వ రోజుకు చేరుకుంది. కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడనాడి తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో కార్మికుల మండల అధ్యక్షులు ఫసియుద్దీన్, కార్యదర్శి బి.సాయిలు, సుదర్శన్, లాలు, యాదగిరి, శంకర్, వాహబ్, తదితరులు పాల్గొన్నారు.

వరదలో కొట్టుకుపోయిన పాడి గేదె

నవతెలంగాణ-లింగంపేట్

పోల్కంపేట్ గ్రామానికి చెందిన బాసు లలిత పాడి గేదె భారీవరద ప్రవాహంలో కొట్టుకుపోయినట్టు గ్రామస్తులు తెలిపారు. పాడి గేదె రోజువారీ మాదిరిగానే గురువారం ఉదయం మేతకు వెళ్లగా సమీపంలోని ఒర్రె వద్ద మేతమేస్తుండగా అంతకంతకూ ఎక్కువవడంతో ఒక్కసారిగా వరద ప్రవాహంలో కొట్టుకుపోయింది. పాడి గేదె విలువ సుమారుగా 60 వేల వరకు ఉంటుందని, గతంలో ప్రభుత్వ సబ్సిడీ పథకం ద్వారా గేదెను తీసుకున్నట్లు తెలిపారు. తనను ఆదుకోవాలని బాధితులు ప్రభుత్వాన్ని కోరారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- ఎంపీవో బ్రహ్మం


గ్రామాన్ని సందర్శిస్తున్న ఎంపీవో

నవతెలంగాణ-పిట్లం

పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీఓ బ్రహ్మం అన్నారు. శుక్రవారం మండలంలోని చిల్లర్గి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామంలోని మురికి కాలువల పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు నిర్వహిస్తూ బ్లీచింగ్ పౌడర్, స్ప్రెడ్ చేసి శుభ్రపరచాలన్నారు. నీటి నిల్వలు ఉన్న గుంతలను పూడ్చివేసి అక్కడక్కడ, వాటర్ ట్యాంక్ ఏరియాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి దోమలను నివారించాలని సూచించారు. అనంతరం పంచాయతీ రికార్డులను పరిశీలించారు.సర్పంచ్ బోయిని రమేష్, సెక్రటరీ విజయ, ఆశావర్కర్లు సునీత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బోధన్ ఆర్డీఓను సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ డివిజన్ నూతన ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన రాజాగౌడ్‌ను బోధన్ ఉమ్మడి మండలాల బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీఓ పర్బన్న, రైతుబంధు మాజీ మండల కోఆర్డినేటర్ బుద్దె రాజేశ్వర్, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ జి.శరత్, ఏఎంసీ వైస్ చైర్మన్ షకీల్, సాలూరా, బోధన్ మండలాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గోగినేని, నరేంద్ర బాబు, డి.సంజీవ్ కుమార్, సహకార సంఘం అధ్యక్షులు అంతయ్య, బోధన్ బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మజర్ అలీ, గురుబ్రహ్మ, కృష్ణగౌడ్ తదితరులున్నారు.

కాంగ్రెస్ కిసాన్ సెల్ మండలాధ్యక్షుడిగా భూక్య అనిల్ కుమార్

నవతెలంగాణ-గాంధారి

కిసాన్ సెల్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా మండలంలోని పెట్‌సంగెం తండాకు చెందిన భూక్య అనిల్ కుమార్‌కు నియామకమయ్యారు. కాగా నియామకపత్రాన్ని నియోజకవర్గ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, కామారెడ్డి కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ.. మండలంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తానని ఆయన అన్నారు.

బదిలీపై వెళ్తున్న ఎస్సైకి సన్మానించిన సర్పంచుల ఫోరం


ఎస్సైకి సన్మానం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ ఎస్సై డి.శంకర్ బదిలీపై సిద్దిపేటకు వెళుతున్న సందర్భంగా వారి సేవలను గుర్తిస్తూ మండలంలోని సర్పంచ్‌లందరూ శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు బండి రాజయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దివిటి రమేష్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు నీరడి సంగయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నెల్లూరి గంగవరం, సర్పంచులు శ్రీకాంత్, నర్సింలు, పీర్సింగ్, వివేకానంద, రాందాస్, పోచయ్య బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కుర్నాపల్లి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

- ఎమ్మెల్సీని కోరిన సర్పంచ్

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని కుర్నాపల్లి గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ సర్పంచ్ దుబ్బాక సావిత్రి రవీందర్‌గౌడ్ కోరారు. ఎంపీటీసీల ఫోరం యూనియన్ మండలాధ్యక్షులు వెంకయ్య రామ్‌రెడ్డి, గ్రామస్తులతో కలిసి ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను నిజామాబాద్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుర్నపల్లి అభివృద్ధికి ఎమ్మెల్సీ నిధులు మంజూరు చేసి గ్రామాభివృద్ధికి సహకరించాలని ప్రజాప్రతినిధులు ఆమెను కోరారు. ఇప్పటికే కుర్నాపల్లిలో 80శాతం అభివృద్ధి పనులు అన్ని విధాలుగా చేపట్టామని, మిగులు గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్సీ నిధులు మంజూరు చేస్తే 100శాతం అభివృద్ధి పనులు పూర్తవుతాయని చెప్పారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ కలవకుంట్ల కవిత కుర్నాపల్లి గ్రామాన్ని గతంలోని తాను దత్తత గ్రామంగా తీసుకున్నందున 100శాతం గ్రామంలో అన్ని విధాల, అన్ని రకాల అభివృద్ధి పనులు జరిగేందుకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో కుర్నాపల్లి సర్పంచ్ సావిత్రి రవీందర్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం యూనియన్ మండలాధ్యక్షులు వెంకయ్య రామ్‌రెడ్డి, ఎడపల్లి సహకార సంఘం మాజీ డైరెక్టర్ సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికే సీఎం కేసీఆర్ ప్రాధాన్యత

- నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే షిండే


సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని వజ్రఖండి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెలే హన్మంత్ షిండే పనులను శుక్రవారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హన్మంత్‌షిండే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామాల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. దేశంలోనే ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వాటిని అమలు చేయడం గొప్పవిషయమని, రైతులకు 24 గంటల ఉచిత నాణ్యమైన కరెంట్ ఇచ్చింది బీఆర్ఎస్ పార్టీ అని పేర్కొన్నారు. ప్రస్తుతం వజ్రఖండి గ్రామంలో రూ.2కోట్ల 80లక్షల వ్యయంతో సబ్‌స్టేషన్‌ను నూతనంగా నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సంజీవ్ పాటిల్, సొసైటీ చైర్మెన్ శివానంద్, వైస్ ఎంపీపీ ఉమాకాంత్, మాజీ మార్కెట్ చైర్మెన్ సాయాగౌడ్, బీఆర్ఎస్ నాయకుడు నీలుపటేల్, కాంగ్రెస్ నాయకుడు దాదారావ్ పటేల్, ట్రాన్స్ కో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బోర్గం శివారులో నీట మునిగిన పంట

- ఆందోళనలో రైతన్నలు

నవతెలంగాణ-రెంజల్


నీటమునిగిన వరి పంట

మండలంలోని బోర్గాం గ్రామ శివారులో చెరువులోని బ్యాక్ వాటర్ రావడంతో రైతుల పంట పొలాలు మునిగిపోయాయి. సంబంధిత అధికారులకు, రెవెన్యూ శాఖకు, నీటిపారుదల అధికారులకు తెలియపరిచిన పట్టించుకోవడం లేదని వారన్నారు. అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టి పండించిన పంట నీటి పాలు అయిందని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.35000 నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరారు.

ఈవీఎంలపై అవగాహన

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని భిక్కనూర్ గ్రామంలో ఎంపీఓ ప్రకాష్ ఈవీఎంలపై ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ.. ఈవీఎంలపై ప్రతి ఒక్క వ్యక్తి అవగాహన కలిగిఉండాలని, ఓటు వేసే ప్రక్రియ ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి గ్రామస్తులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు కూలిన ఇండ్లు

నవతెలంగాణ-విలేకరుల బృందం


సదాశివనగర్ : కూలిన ఇల్లు


ఎల్లారెడ్డిలో..

సదాశివనగర్ : మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి ఇల్లు కూలిపోయింది. గ్రామానికి చెందిన సాకలి గంగి బాలయ్య ఇల్లు కూలి పోయిందని సర్పంచ్ బాల్‌రెడ్డి తెలిపారు.

కూలిపోయిన ఇండ్లను పరిశీలించిన ఆర్డీవో..

లింగంపేట్ : ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కూలిపోయిన ఇండ్లను ఎల్లారెడ్డి ఆర్డీవో రమేష్ రాథోడ్ శుక్రవారం పరిశీలించారు. మండలంలోని పలు గ్రామాల్లో వర్షాల కారణంగా 48 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఎమ్మార్వోకు సూచించారు. అదేవిధంగా చెరువులు నిండి పొంగి పొర్లడంతో చెరువులకు ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని రెవెన్యూ సిబ్బందిని గ్రామాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలు కారణంగా కూలిపోయిన ఇండ్లు వివరాలను క్షేత్రస్థాయిలోకి వెళ్లి వారి వివరాలు సేకరించాలని ఆయన ఆదేశించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా ఎల్లారెడ్డి ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టి లింగంపేట్‌కు రావడంతో ఎమ్మార్వో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎమ్మార్వో చంద్ర రాజేశ్వర్, రవీంద్ర సిబ్బంది శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలయ్య, ఆపరేటర్లు లింగం కుమార్, వీఆర్ఏ లక్ష్మణ్ తదితరులున్నారు.


లింగంపేట్ : కూలిన ఇండ్లను పరిశీలిస్తున్న ఆర్డీవో


కూలిన ఇండ్ల వివరాలను పరిశీలన..

రెంజల్ : మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో శుక్రవారం ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూలిపోయిన ఇండ్లను రైతు సమన్వయ కమిటీ మండల అధ్యక్షులు కాశం సాయిలు పరిశీలించారు. కూలిపోయిన ఇండ్ల వివరాలను తహసీల్దార్‌కు తెలియజేయనున్నట్టు ఆయన తెలిపారు. ఆయన వెంట స్థానిక నాయకులు కుమార్, పిల్లల ప్రవీణ్, బంటు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని లింగారెడ్డిపేట్ మున్సిపాలిటీ పరిధిలోని ఇటీవల కురిసిన భారీ వర్షానికి మామిడి లింగం నివాసపు ఇల్లు కూలింది. ప్రభుత్వం ఆదుకోవాలని భాదితుడు కోరారు.


నేరుగా సిబ్బందికి జీతాలు వేయాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలకు బదులుగా ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు నేరుగా లేదా ఉద్యోగుల సంక్షేమ బోర్డు ద్వారా జీతాలు అందించాలని కోరుతూ శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శాసనసభ సభ్యులు జాజాల సురేందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వివిధ కారణాల వల్ల ప్రభుత్వం జీతాలు ఆలస్యం చేస్తే ఏజెన్సీలు మూడు నెలల వరకు జీతాలను సకాలంలో చెల్లించటం లేదని తెలంగాణ ప్రభుత్వ సూచనలు, నిబంధనలను ఏజెన్సీలు పాటించడం లేదని, అందువల్ల ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి, నేరుగా జీతాలు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమ బోర్డును అందించాలని కోరారు. ఐదు సంవత్సరాల కంటే ఎక్కువ పని చేసే వారికి ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు జరగాలి



నవతెలంగాణ-భిక్కనూర్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు జరిగే విధంగా సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్ సింగ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకు ఎన్ని కాన్పులు జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల కంటే ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఎక్కువ కాన్పులు జరిగే విధంగా సిబ్బంది అవగాహన కల్పించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి హేమీమా, వైద్య సిబ్బంది ఉన్నారు.

కేంద్రీయ విద్యాలయం మంజూరు చేయాలి

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రానికి కేంద్రీయ విద్యాలయం మంజూరు చేయాలని గ్రామ యువకులు సర్పంచ్ సురేష్‌కు, గ్రామ కార్యదర్శి సందీప్ కుమార్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని నెలల కింద తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టగా జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతుషిండే దీక్ష శిబిరానికి వచ్చి కేంద్రీయ విద్యాలయం మద్నూర్ మండల కేంద్రానికి మంజూరు అవుతుందని హామీనిచ్చి ఆందోళనలు విరమింపజేశారని, ఎమ్మెల్యే తన బాధ్యతగా కేంద్రీయ విద్యాలయాన్ని వెంటనే మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ యువకులు సిద్ధప్ప, బాలుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- సర్పంచ్ బట్టు హన్మండ్లు

నవతెలంగాణ-ఎడపల్లి

కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ బట్టు హన్మండ్లు అన్నారు. శుక్రవారం కూలిపోయే దశలో ఉన్న పురాతన ఇండ్లను ఆయన పరిశీలించారు. మరింత వర్షాలు విస్తారంగా కురిస్తే ప్రజలకు పునరావాసం కోసం ప్రభుత్వ కార్యాలయంలో తాత్కాలికంగా ఉండేందుకు ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. గ్రామం పక్కనే చెరువు నిండుకుండలా పొంగిపోతున్నందున ఆయకట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలం

నవతెలంగాణ-వర్ని

కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని పలువురు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తెలిపారు. మోస్రా మండలంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఒకే విడతలో రూ.2లక్షల రుణమాఫీ, వితంతువులు, వికలాంగులకు రూ.4వేలు పింఛన్, నిరుద్యోగ భృతి 4000, గ్యాస్ సిలిండర్ రూ.500 లకే ఇస్తామని చెప్పారు.

విద్యార్థినీలకు కంటి పరీక్షలు

నవతెలంగాణ-దోమకొండ



విద్యార్థినీలకు కంటి పరిక్షలు నిర్వహిస్తున్న లింబాద్రి

బీబీపేట్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినీలకు కంటి వైద్యాధికారి లింబాద్రి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వసతి గృహాలలో విద్యార్థినీలకు కంటి సంబంధిత సమస్యలకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంగమ్మ, ఉపాధ్యాయురాలు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- మండల వాసులకు మంత్రి భరోసా

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలో భారీ వర్షాలవల్ల మండలంలో జరిగిన నష్టాల వివరాలను రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి శుక్రవారం మండల ప్రజాప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. మండల వాసులు మంత్రి వర్షాల వల్ల ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి లోటుపాట్లు ఉన్నచోట గ్రామస్థులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు సామ వెంకట్ రెడ్డి, బద్దం నర్సారెడ్డి, సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, టౌన్ అధ్యక్షులు పెంటు గంగాధర్, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, కో అప్షన్ సభ్యులు మునిరొద్దీన్, బ్రహ్మదండి లింగం, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు నిత్యావసర సరుకులు పంపిణీ

నవతెలంగాణ-ఏర్గట్ల

భారీ వర్షాలతో నిరాశ్రయులైన రోజువారీ కూలీ చేసుకునే పేదవారికి కాంగ్రెస్ నాయకులు ముత్యాల సునీల్ రెడ్డి సూచనల మేరకు సునీల్ యువసేన సభ్యులు శుక్రవారం గుమ్మిర్యాల్ గ్రామంలో ఇరవై కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో సునీల్ యువసేన సభ్యులు బెజ్జారం భాను,పాలేపు నర్సయ్య,తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీ కాలువకు నీటి విడుదల

నవతెలంగాణ-ముప్కాల్

ఉత్తర తెలంగాణ వరప్రదయని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాలువల్లో ఒకటైన లక్ష్మీ కాలువ ద్వారా శనివారం ఆయకట్టు రైతులకు నీరందించేందుకు ప్రాజెక్టు అధికారులు సన్నద్ధం అయ్యారు. వానాకాలం దృష్ట్యా పంటలకు నీరందించేందుకు లక్ష్మీ కాలువ ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. ప్రాజెక్టు అధికారులు శనివారం నీటిని విడుదల చేస్తామన్నారు.

సంవత్సరానికే బ్రిడ్జి కూలిపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమే

- పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 50వేలు పరిహారం అందించాలి
- మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



బ్రిడ్జిన్ని పరిశీలిస్తున్న భూపతిరెడ్డి

సంవత్సరం క్రితమే నిర్మించిన బ్రిడ్జి కూలిపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమని, పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 50వేల రూపాయలు నష్టపరిహారం అందించాలని మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని తొర్లికొండ గ్రామంలో ఇటీవలే కురిసిన వర్షానికి తొర్లి కొండ నుంచి మనోహరాబాద్ వెళ్లడానికి ప్రధాన రహదారిలో బ్రిడ్జి కూలిపోయిన విషయం తెలుసుకొని శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవీలైనంత తొందరగా బ్రిడ్జి పనులను ప్రారంభించాలని ఈఈతో మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 50.000 రూపాయలు చొప్పున నష్టపరిహారం కల్పించాలనిప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు వినోద్, జిల్లా కార్యదర్శి గన్నా లక్ష్మణ్, సైకిల్ అక్బర్, బంగ్లా వసంతరావు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

డిపో మేనేజర్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్



ఆర్టీసీ డిపో మేనేజర్‌కు సన్మానం

నూతనంగా వచ్చిన డిపో మేనేజర్ టి.శ్రీనివాస్‌ను ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు రవిచందర్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానం చేశారు. కార్యక్రమంలో రీజినల్ నెంబర్ డిసి గోపి, జనార్ధన్ విట్టల్ ,జగదీష్, వేల్పూర్ గంగాధర్, ఆర్ పోచయ్య మెకానిక్ శీను ,లక్కోరా నరసయ్య, కేలింభాద్రి అంకాపూర్ ప్రతాప్ ,చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ఏసీపీకి సన్మానం

నూతన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జగదీష్ చందర్‌కు పట్టణ సామాజిక సేవకులు పట్వారీ తులసి కుమార్ ఏసీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి జ్ఞాపికని అందజేశారు. ఈ సందర్భంగా పట్వారీ తులసి మాట్లాడుతూ.. ఎల్లప్పుడూ అందుబాటులో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు రక్షణగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఎల్లప్పుడూ తమవంతు సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు..

తీగలవాగు బ్రిడ్జికి మరమ్మతు చేయించండి

- అధికారులకు మంత్రి వేముల ఆదేశం
- దెబ్బతిన్న తీగల వాగు బ్రిడ్జి పరిశీలన

నవతెలంగాణ-ఏర్గట్ల



దెబ్బతిన్న బ్రిడ్జిని పరిశీలిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

వర్షాల వల్ల ఏర్గట్ల నుండి మెట్‌పల్లికి వెళ్లే తీగల వాగు బ్రిడ్జి ధ్వంసం అవడంతో... రాకపోకలు బంద్ అయి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. దెబ్బతిన్న బ్రిడ్జి నిర్మాణం కోసం అంచనా వేసి, బ్రిడ్జికి మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. చాలా సంవత్సరాల తర్వాత ఇలాంటి భారీ వర్షాలు కురిశాయని, ప్రకృతి వైపరీత్యం వల్ల పూర్తిస్థాయిలో ఇండ్లు కూలిన వారికి గృహలక్ష్మి పథకం వర్తింపచేయిస్తానని అన్నారు. ప్రజలు భయాందోళనలు గురికావద్దని తెలిపారు.నష్టపోయిన పంటల వివరాలు తెలుసుకొని విచారం వ్యక్తంచేశారు.వర్షం రైతులకు తీవ్ర నష్టం చేసిందని అన్నారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుండి అధిక మొత్తంలో నీరు వస్తుందని, గోదావరి నది పరివాహక గ్రామలైన తడపాకల్, గుమ్మిర్యాల్, దోంచంద గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. గోదావరి నది పరిసరాలకు ప్రజలెవ్వరు వెళ్ళకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రెవిన్యూ పోలీస్ శాఖ వారిని ఆదేశించారు.ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పూర్ణానందం, ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, ఎంపీటీసీ జక్కని మధుసూదన్, కోఆప్షన్ సభ్యుడు అష్రాఫ్, సర్పంచ్ పత్తిరెడ్డి ప్రకాష్, నాయకులు నెరేళ్ళ లింగారెడ్డి, బద్దం శ్రీనివాస్ రెడ్డి, పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి, తుపాకుల శ్రీనివాస్ గౌడ్, బద్దం ప్రభాకర్, బర్మ చిన్న నర్సయ్యసిగసారం గంగారాం, సున్నపు అంజయ్య, రోక్కెడ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం

నవతెలంగాణ-నందిపేట్



దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మండలంలో భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను రోడ్లను, కూలిన ఇళ్లను ఎమ్మెల్యే జీవన్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. వర్షాల వల్ల నష్టపోయిన పంటలు, కూలిన ఇళ్ల నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి పంపి నష్టపరిహారానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కుద్వాన్‌పూర్ గ్రామంలో నిరుపేద వృద్ధురాలి కూలిన ఇల్లును చూసి ఎమ్మెల్యే ఆవేదన చెందారు. వెంటనే ఆ కూలిన ఇళ్లకు మూడు లక్షల రూపాయల గృహలక్ష్మిపథకానికి ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. నందిపేట్ పట్టణంలో చెడిపోయిన రోడ్లను, దేవమ్మ గుడి దగ్గర హై లెవెల్ బ్రిడ్జిని వెంటనే నిర్మిస్తానని హామీ ఇచ్చారు. పట్టణంలో కొద్ది రోజుల క్రితం మరణించిన చుక్కబట్లమోహన్ రావు కుటుంబాన్ని, కరెంట్ షాక్ తగిలి గాయపడిన ఆర్మూర్ గంగారం కుటుంబాన్ని, ఈనాడు విలేకరి మురళి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నందిపేట్ మండల భారత రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షులు మచ్చర్ల సాగర్, జెడ్పిటిసి ఎర్రం యమునా ముత్యం, ఉప సర్పంచ్ భరత్, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ హుస్సేన్, వార్డు మెంబర్లు, మైనార్టీ అధ్యక్షులు పాషా, యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

వరద ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు వరదనీరు చేరిన ప్రాంతాలను పట్టణంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు మండలంలోని పిప్రీ, మంతిని గ్రామాల మధ్య వాగు ప్రవాహం వల్ల తెగిపోయిన రోడ్డును పరిశీలించి త్వరితగతిన మరమ్మత్తులు చేపట్టాలని అధికారులకు సూచించారు. పట్టణంలోని ఆలూరు బైపాస్ రోడ్డులో వరద ఉధృతిని ఎమ్మెల్యే పరిశీలించి ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రజా ప్రతినిధు లు, అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. ఆలూర్ మండల కేంద్రంలోని చెరువుల వరద ఉధృతిని పరిశీలించారు. మండలంలోని దేగాం గ్రామంలో వర్షాలతో అధ్వాన్నంగా తయారైన రోడ్ల వెంట ఎమ్మెల్యే స్వయంగా బ్లీచింగ్ పౌడర్ చల్లినారు కార్యక్రమంలో ఎంపీపీ పస్కా నరసయ్య, జడ్పిటిసి మెట్టు సంతోష్, మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్, బి ఆర్ ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు పూజ నరేందర్, ఆలూరు శ్రీనివాస్ రెడ్డి, సర్పంచులు కళ్లెం మోహన్ రెడ్డి, దేగాం గంగారెడ్డి, ఆశాపురం శ్రీనివాస్ రెడ్డి, దార్ల రాజు, పిప్రీ సొసైటీ చైర్మన్ సోమ హేమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు



పంట పోలలను పరిశీస్తున్న ఎమ్మెల్యే

మండలంలోని దేగాం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ వర్షాలకు నష్టపోయిన పంటలను శుక్రవారం పరిశీలించినారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలవల్ల వరి, సోయా మొక్కజొన్న పంటలు నీటిలో మునిగిపోయాయని అన్నారు. 1950 ఎకరాలలో నష్టం వాటిలినట్లు ప్రాథమిక అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

పెద్దమొత్తంలో సబ్‌స్టేషన్‌ల మంజూరు

- ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

నవతెలంగాణ-మద్నూర్




సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కరెంటు సరఫరా కోసం ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని, బోరుబావులతో పాటు ప్రతి ఇంటికి 24 గంటల పాటు కరెంట్ సరఫరా అందిస్తున్నామని ఎమ్మెల్యే హన్మంత్ షిండే తెలిపారు. జుక్కల్ నియోజకవర్గానికి పెద్దమొత్తంలో సబ్‌స్టేషన్‌లు మంజూరు చేయించామని తెలిపారు. మండలంలోని పెద్దఎక్లారాలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే షిండే శుక్రవారం భూమిపూజ చేశారు.

మండలంలోని పెద్దఎక్లారా గ్రామాభివృద్ధికి ఆ గ్రామ సర్పంచ్ హారిక శ్రీనివాస్ పటేల్, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి శంకర్ పటేల్, డైరెక్టర్ సుధాకర్ పటేల్, సొసైటీ మాజీ చైర్మన్ పండిత్ రావు పటేల్ ఈ నలుగురు ఆ గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు. గ్రామానికి సబ్‌స్టేషన్ అవసరమని ఎమ్మెల్యే హనుమంతుషిండేకు విన్నవించగా పెద్దఎక్లారా గ్రామానికి ఎమ్మెల్యే కృషి ఫలితం సబ్ స్టేషన్ మంజూరు చేయించారు. ఈ సబ్ స్టేషన్ అభివృద్ధికి మూడు కోట్ల రూపాయలు నిధులు ఖర్చు అవుతాయని ట్రాన్స్‌కో ఏఈ అరవింద్ తెలిపారు. ఈ గ్రామానికి మంజూరైన సబ్ స్టేషన్ ఏర్పాటుతో ఐదు గ్రామాలకు కరెంటు సరఫరా అవుతుందని ఏఈ వివరించారు. మా విన్నపాన్ని మన్నించి తమ గ్రామానికి సబ్‌స్టేషన్ మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామపెద్దలు ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ రామ్ పటేల్, బిచ్కుంద ఎంపీపీ అశోక్ పటేల్, మద్నూర్ సింగిల్ విండో చైర్మన్, మండల జెడ్పీటీసీ కుటుంబ సభ్యులు కథలయ్య శ్రీనివాస్ పటేల్, డైరెక్టర్ సుధాకర్ పటేల్, మాజీ సొసైటీ చైర్మన్ పండిత్‌రావు పటేల్, ఎంపీటీసీ కుటుంబ సభ్యులు శంకర్‌పటేల్, ట్రాన్స్‌కో జిల్లా అధికారి, ఎస్సీ ఏడీ మండల అభివృద్ధి అధికారి రాజేశ్వర్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బంసి పటేల్, గ్రామ కార్యదర్శి కృష్ణవేణి, ట్రాన్స్‌కో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నీరు నిల్వ ఉంటే రోగాల వ్యాప్తి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఉప సర్పంచ్

మండలంలోని హాసకొత్తూర్ గ్రామంలో ఫ్రైడే, డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఉప సర్పంచ్ ఏనుగు రాజేశ్వర్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. నీటి కుండిలను, పూల కుండీలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పనికి రాని టైర్లు, బకిట్లలో, తాగిన కొబ్బరి బొండాలలో నీళ్ల నిల్వ ఉంచకూడదన్నారు. కూలరులో ఉన్న నీళ్లను తీసివేసి శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. నిల్వ ఉన్న నీటిలో లార్వా, దోమలు వృద్ధి చెంది ఆరోగ్యానికి హాని చేస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ రాజేశ్వర్ మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని, దానిని కాపాడుకోవడం మన బాధ్యత అని అన్నారు. ఇంటిలోనే తడి చెత్తను, పొడి చెత్తను వేరువేరుగా గ్రామపంచాయతీ ద్వారా అందించిన చెత్తబుట్టలో నిల్వ ఉంచుకొని పంచాయతీ ట్రాక్టర్ వచ్చినప్పుడు అందులోనే వేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, ఈజీఎస్ ఏపీవో విద్యానంద్, ఏఎన్ఎం మమత, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలి

- ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కంటి వెలుగు ఇన్చార్జి వైద్యాధికారి రాజ్‌కుమార్

నవతెలంగాణ-ఎడపల్లి

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు మంచినీటి ట్యాంకు ద్వారా సరఫరా అవుతున్న ట్యాంకులను ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రపరిచి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరును అందించాలని ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కంటి వెలుగు ఇంచార్జి వైద్యాధికారి రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని తానాకాలన్ గ్రామాన్ని సందర్శించి ఆయన మంచినీటి ట్యాంకును పరిశీలించారు. మంచినీటి ట్యాంకులలో ఎంతవరకు నీరు నిల్వ ఉందని ఆయన నీటి, మోటార్‌తో పరిశీలించారు. వాటర్ ట్యాంకులను వారానికి రెండుసార్లు బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రపరచాలన్నారు. ట్యాంకులలో నీరు నిలువ ఉంటే ట్యాంకుల చుట్టూ లోపల బాగా రా ఆకులు పడుతుందని, ఆకులు నువ్వు తొలగించేందుకు బేసిన్ పౌడర్ వాడాలని ఆయన అన్నారు. అపరిశుభ్రమైన నీటిని ప్రజలకు సరఫరా చేస్తే లేని జబ్బులు ప్రజలకు సోకుతాయని ఆయన గుర్తు చేశారు. వర్షాకాలంలో ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు గ్రామపంచాయతీ అధికారులు సిబ్బంది లీకేజీ ఉన్నచోట్ల మరమ్మతులు చేయించి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా చేయాలని ఆయన కోరారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి నరసయ్య, ఆశావర్కర్ ఉన్నారు.

భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఎస్సై డి.సుధాకర్

నవతెలంగాణ-గాంధారి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో మండల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని గాంధారి ఎస్సై డి.సుధాకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని దుబ్బ తాండా గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. పాత మట్టి గోడల ఇండ్లలో ప్రజలు నివాసం ఉండవద్దని సూచించారు. కూలే అవకాశమున్న వాటికి దూరంగా ఉండాలని, విద్యుత్ స్తంభాలకు ఎలక్ట్రికల్ షాక్ వచ్చే అవకాశం ఉన్నందున వాటిని తాకవద్దని తెలిపారు. రైతులు పంట పొలాలకు వెళ్లే సమయంలోనూ విద్యుత్ స్తంభాల మీటర్లు స్టార్టర్లను తాకవద్దని సూచించారు. అవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని తెలిపారు. తీవ్ర వర్షా ప్రభావం ఉన్నందున పిల్లలు బయటకు వెళ్లకుండా చూసుకోవాలన్నారు. నీటిలో ఆడేందుకు సరదాగా వెళ్లి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉన్నందున పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నీటితో నిండి ఉన్న చెరువులు, కుంటల వద్దకు చూసేందుకు వెళ్లవద్దని సూచించారు.

నిరాశ్రయులకు భోజనం పొట్లాలు అందజేత

నవతెలంగాణ-బోధన్‌టౌన్



పొట్లాలను అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పట్టణంలోని పలు వార్డులలో నిరాశ్రయులకు జిల్లా పరిపాలన అధికారి ఆదేశాల మేరకు బోధన్ మున్సిపల్ సిబ్బంది భోజనం పొట్లాలను శుక్ర వారం అంద జేశారు. పునరావాస కేంద్రాలలో ఏర్పాట్లను సమకూర్చినట్లు మున్సిపల్ అధికారులు వెల్లడించారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివాసం ఉంటున్నవారు సత్వరమే ఖాళీ చేసి తాత్కాలిక ఏర్పాట్లను చేసుకోవాలని కోరారు.

దోస్పల్లిలో ఫ్రై డే డ్రైడే

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని దోస్పల్లి గ్రామంలో సర్పంచ్ సునీతా పటేల్ ఆధ్వర్యంలో డ్రైడే - ఫ్రైడేను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్, జేపీఎస్, ఆశావర్కర్ కలిసి ఇంటింటికీ తిరిగి వర్షకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యం, తాగునీరు, పారిశుధ్యం గురించి వివరించారు. వర్షాలు భారీగా పడుతున్నాయని అవసరం అయితే తప్పా బయటకి రావద్దని, పాత ఇండ్లల్లో ఉండవద్దని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్ పింకుబాయి, జేపీఎస్ జాదవ్ మనోహర్, ఆశావర్కర్ బశవ్వ తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన రోడ్డు

నవతెలంగాణ-మాక్లూర్



కోతకు గురైన రోడ్డు

మండలంలోని మందాపూర్, దర్మోరా గ్రామాల మధ్య వర్షాలకు బిటి రోడ్డు కోతకు గురైంది. రెండు గ్రామాల మధ్య బిటి రోడ్డు వర్షాల వల్ల కోతకు గురి కావడంతో స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వాహనదారులు ప్రయాణం ప్రమాదకరంగా ఉందని అంటున్నారు. రెండు వాహనాలు ఒకే సారి వెళ్లలేని పరిస్థితి ఉందని, ఒక్కటి వచ్చిందంటే మరొక్కటి పక్కకు వెళితే గుంతలో పడీ ఇరుకోవల్సిందేనాని స్థానికులు తెలిపారు. వెంటనే ఉన్నత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరివైపులా మరమత్తులు చేయించాలని కోరారు.

పోడు భూముల పట్టా పాస్ బక్కులు పంపిణీ

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

పోడుభూముల పట్టాపాస్‌బుక్కులను మల్లారం -సంతోష్, మల్కాపూర్ (జె)-దేవిదాస్, కొత్తపేట్‌కు మండల్ ఆఫీస్ లో శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధికారి మల్లేశ్, మండల అధ్యక్షుడు అనూష ప్రేమ్ నాయక్, మండల అధ్యక్షుడు మీసాల మధుకర్ రావ్, మల్లారం సర్పంచ్ చింతకింది నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి

- కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుంది
- మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో కార్మికుల చేపట్టిన సమ్మెను శిబిరాన్ని డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి మాజీ ఎమ్మెల్సీ శుక్రవారం సందర్శించి మద్దతు తెలిపారు. గ్రామాలలో డ్రైనేజీ పరిస్థితి గమనించి వీరి ససమ్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిన్నారెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు సొప్పరి వినోద్, ప్రధాన కార్యదర్శి వసంతరావు, జనరల్ సెక్రెటరీలు లక్ష్మణ్, బాలయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షులు సైకిల్ టెక్స్ అక్బర్, రూరల్ ఎస్టి సెల్ యూత్ అధ్యక్షులు ఈర్సింగ్, మండల వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు రవి, యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్



మండలంలోని చేపూర్ గ్రామంలో లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న సర్పంచ్ ఇందూరు సాయన్న

మండలంలోని చేపూర్ గ్రామంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, సీఎంఆర్ ఫ్ చెక్కులు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇందూరు సాయన్న లబ్ధిదా రులకు చెక్కులను అందజేశారు.

... ఖానాపూర్ గ్రామంలో...

మండలంలోని ఖానాపూర్ గ్రామంలో పద్మ నర్సు, కవితకు పంపిణీ చేయడం జరిగిందని సర్పంచ్ సింగిరెడ్డి మోహన్ తెలిపారు.